సాక్షి పల్నాడు

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



ఆవులయ్య స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెంలో ఆవులయ్య స్వామి తిరునాళ్ల గురువారం నిర్వహించారు. భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం గురువారం 512.10 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 6,325, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
నరసరావుపేట	6.28	4.45
గుంటూరు	6.26	4.43
బాపట్ల	6.26	4.43

న్యూస్‌రీల్

రుక్మిణీ కల్యాణం అలంకారంలో శ్రీవారు



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి రుక్మిణీ కల్యాణం అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మాజీ ఎమ్మెల్యే జీవీకి నోటీసులు

వినుకొండ: మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ నాయకుడు జి.వి.ఆంజనేయులుకు ఎన్నికల అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు అందజేశారు. ఇటీవల ఈపూరు మండలం కొండ్రముట్లలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ రిటర్నింగ్ అధికారి ఆంజనేయులపై గురువారం నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దీనిపై జీవీ ఆంజనేయులు 24 గంటల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు



అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలో కొలువైన గంగా, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శాంతి హోమాలు, యాగాలు, చండీపారాయణ నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోకేశ్ వస్తేనే జనాన్ని తెస్తారా..నేను వస్తే రారా!!

నాయకులపై పెమ్మసాని ఆగ్రహం

మంగళగిరి: 'లోకేశ్ వస్తేనే జనాన్ని తరలిస్తారా .. నేను వస్తే కార్యకర్తలు కూడా రారా' అంటూ గుంటూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మంగళగిరి పట్టణంలో ప్రచారం చేశారు. అయితే, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు ప్రచారంలో పాల్గొనలేదు. జనం లేకపోవడం, కార్యకర్తలు కూడా హాజరుకాకపోవడంతో పెమ్మసాని అసహనానికి లోనై నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నానని, ఇప్పటికే పార్టీ ఫండ్ వందల కోట్లు ఇచ్చానని వాపోయారు. లోకేశ్ సొమ్ము ఏమి పెట్టడం లేదని బహిరంగంగా వ్యాఖ్యానించడంతో నాయకులు, కార్యకర్తలు విస్తుపోయారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రచారానికి జనాన్ని ఎందుకు తీసుకురావడం లేదని పెమ్మసాని ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాయకులు, కార్యకర్తలు కూడా అసహనానికి గురయ్యారు. డబ్బులు ఇచ్చిన వారిని అడగాలి.. పార్టీ మీద అభిమానంతో రూపాయి తీసుకోకుండా ప్రచారానికి వస్తున్న కార్యకర్తలను అంటారా ? అంటూ అక్కడ నుంచి వెళ్లిపోవడంతో చేసేదేమి లేక కొద్దిసేపు పర్యటించి పెమ్మసాని వెనుతిరిగారు.

వైభవంగా శిలాబింబి ప్రతిష్ట మహోత్సవం



హుస్సేన్ నగరం(పెదకూరపాడు): పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో కొలువై ఉన్న రేణుకా అంకమ్మతల్లి, పోతురాజు శిలాబింబి ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండలో తల్లడిల్లిన ముసలి ప్రాణం

- కుట్రలను ఛేదిస్తూ, అవ్వతాతలకు ప్రభుత్వం భరోసా
- పింఛన్ పంపిణీ ఆలస్యం అయ్యేలా కుట్ర పన్నిన చంద్రబాబు
- అవస్థలు పడుతూ సచివాలయానికి చేరుతున్న లబ్ధిదారులు
- సచివాలయ సిబ్బంది ద్వారా వేగంగా నగదు పంపిణీకి చర్యలు తీసుకున్న ప్రభుత్వం
- పల్నాడు జిల్లాలో గురువారం రాత్రి 7 గంటలకు 87.44 శాతం పంపిణీ పూర్తి
- జిల్లావ్యాప్తంగా 2,46,659 మందికి రూ.74.44 కోట్లు అందజేత
- సచివాలయాల వద్ద టెంట్లు, మంచి నీరు సౌకర్యం ఏర్పాటు
- వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ అడ్డుకున్న చంద్రబాబును దుమ్మెత్తి పోస్తున్న పింఛన్ లబ్ధిదారులు



పిడుగురాళ్ల పట్టణంలోని 17వ వార్డు సచివాలయం వద్ద పింఛన్‌దారుల పడిగాపులు



ఈపూరు మండలం కొచ్చెర్లలో సచివాలయం వద్ద నగదు కోసం బారులుతీరిన పింఛన్‌దారులు

సాక్షి, నరసరావుపేట: ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటికే పింఛన్ తీసుకువచ్చే వలంటీర్ వ్యవస్థపై కుట్రలు చేసి అవ్వాతాతలకు నగదు అందకుండా చంద్రబాబు నాయుడు చేసిన కుట్రలను ప్రభుత్వం ఛేదించింది. లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగంగా నగదు పంపిణీ అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు.. ఖజానా ఖాళీ అయ్యిందంటూ పండుటాకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పచ్చ మూకల ప్రచారాలను ప్రభుత్వం తిప్పికొట్టింది. సచివాలయ సిబ్బందికి పంపిణీకి అవసరమైన నగదును అందజేసింది. బుధవారం ప్రాధాన్యతాక్రమంలో పెద్ద వయసు మహిళలకు, వికలాంగులకు అందజేయగా, గురువారం ఉదయం 7 గంటల నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాలలో పింఛన్‌దారులందరికీ నగదు పంపిణీ చేశారు. ముఖ్యంగా సచివాలయాలకు వచ్చిన వృద్ధులకు నీడ కోసం టెంట్లు వేశారు. తాగునీటిని అందుబాటులో ఉంచారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొని వృద్ధులకు ఉపశమనాన్ని ఇచ్చింది. నడవలేని, ఆరోగ్యం సహకరించని పింఛన్‌దారులకు నేరుగా సచివాలయ సిబ్బంది వెళ్లి నగదు అందజేయనున్నారు.

నేడు, రేపు కూడా పంపిణీ

పల్నాడు జిల్లాలో ఏప్రిల్ నెలలో వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులు 2,82,105 మంది ఉన్నారు. వీరిలో గురువారం రాత్రి 7 గంటలకు 2,46,659 మందికి పంపిణీ పూర్తి చేశారు. ఇది మొత్తం పింఛన్లలో 87.44 శాతానికి సమానం. జిల్లాకు పింఛన్‌దారుల నగదు పంపిణీకి ప్రభుత్వం రూ. 84,27,99,500 విడుదల చేసింది. ఇందులో గురువారం రాత్రి 7 గంటలకు రూ.74,44,36,000ను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. నేడు, రేపు కూడా పంపిణీ కొనసాగనుంది. అవసరమైతే గడువును పొడగించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

రాజకీయాలు చేయడం సరైంది కాదు



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. నెలనెలా వలంటీర్ ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవాడు. ఇప్పుడేదో రాజకీయాలు చేసి మమ్మల్ని సచివాలయానికి రమ్మంటున్నారు. నాలుగు నెలల కిందట ఎడమకాలికి ఇన్‌ఫెక్షన్ వచ్చి ఆపరేషన్ చేశారు. ఈ పరిస్థితుల్లో ఎలా వెళ్లి డబ్బులు తీసుకోవాలి ? మాలాంటి ముసలి వారిపై రాజకీయాలు చేసి ఇబ్బంది పెట్టడం సరైందికాదు. ఇప్పటి నుంచైనా వలంటీర్‌నే ఇంటి వద్దకు పంపి నగదు అందజేసే ఏర్పాటు చేయాలి.

– మధిర రామస్వామిరెడ్డి,
చాగంటివారిపాలెం గ్రామం, ముప్పాళ్ల మండలం

వలంటీర్ ద్వారానే డబ్బులు పంచాలి



వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇంటి వద్దనే ఒకటో తేదీన పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. ఆ డబ్బుతో నెలనెలా మందులు, ఇతర అవసరాలు తీర్చుకునేవాళ్లం. ఎన్నికలు వస్తున్నాయని వలంటీర్లను ఆపమని చెప్పారట. ఈ వయసులో ఎండకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవడం ప్రాణాల మీదకు వస్తోంది. మాపై కుట్రలు చేయకండి. వలంటీర్ ద్వారానే పింఛన్ డబ్బులు ఇవ్వాలి.

– యాసరపు చిన్న పుల్లయ్య,
కెఎం అగ్రహారం. నరసరావుపేట రూరల్ మండలం.

రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి



నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గుంటూరు నగరంలోని రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ ఐజీగా విధులు నిర్వర్తించిన జి.పాలరాజు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠిని అధికారులు నియమించారు. 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన 2016–18లో గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు.

పల్నాడు జిల్లా ఎస్పీగా బిందుమాధవ్

- ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల సంఘం
- గతంలో అడిషనల్ ఎస్పీగా పనిచేసిన అనుభవం



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు గతంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా, ఎస్‌ఈబీ ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది. గతేడాది ఏప్రిల్ 8న గ్రేహౌండ్స్ ఎస్పీగా పదోన్నతి పొంది పల్నాడు నుంచి వెళ్లారు. తిరిగి జిల్లాకు ఎస్పీగా వచ్చారు. పల్నాడు జిల్లా తొలి ఎస్పీగా పనిచేసిన వై. రవిశంకర్ రెడ్డి మంగళవారం బదిలీ అయిన సంగతి తెలిసిందే.

సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకే జై

- పార్లమెంట్,అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి
- ఆర్యవైశ్యుల సమ్మేళనంలో వెల్లడి
- పార్టీలో చేరిన పలువురు ఆర్యవైశ్యులు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి. వేదికపై పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ అనిల్ తదితరులు

నరసరావుపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం సాధించబోతోందని , ఈ మాట ప్రముఖ సర్వే సంస్థలే స్పష్టం చేస్తున్నాయని పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం 29వ వార్డులోని తిరుమల ప్యాలెస్ అపార్టుమెంట్‌లో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్తలు కాకుమాను శ్రీనివాసరావు, అరవపల్లి శ్రీనివాసరావుతో పాటు మరో 20 ఆర్యవైశ్యుల కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరిని పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ మాట్లాడుతూ తాను నెల్లూరు టౌన్ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మరో ఐదేళ్లు నియోజకవర్గ ప్రతిపక్ష నాయకుడిగా, రెండున్నరేళ్లు రాష్ట్ర మంత్రిగా వ్యవహరించానన్నారు. నెల్లూరులు ఆర్యవైశ్యులు వ్యాపారులుగా ప్రసిద్ధులని, వారికి చేదోడువాదోడుగా నిలవడమే తప్పా ఏరకంగానూ ఇబ్బంది పెట్టలేదన్నారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యునిగా అందరికీ అందుబాటులో ఉంటానని, తననెప్పుడైనా కలవవచ్చునని మాటిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులు తమ వంతు సహకారాన్ని అందించి ఆదరించాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్యుల రాజకీయ చతురత అమోఘం: డాక్టర్ గోపిరెడ్డి

అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల రాజకీయ చతురత అమోఘమన్నారు. చాణక్య రీతిన రాజకీయం చేయటంలో అసామాన్యులు అని అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో ఎవరు అధికారంలో వస్తారో, ఏపార్టీ విజయం సాధిస్తుందో ముందే పసిగట్టే తెలివితేటలు ఆర్యవైశ్యుల సొంతమని ప్రశంసించారు. జాతీయస్థాయిలో రాజకీయ సర్వే సంస్థలన్నీ రానున్న ఎన్నికలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఇప్పటికే చెప్పేశాయన్నారు. ప్రముఖ అరా పొలిటికల్ సంస్థ ప్రతినిధి మస్తాన్‌రావు కూడా రానున్న ఎన్నికలల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ఇటీవల వెల్లడించిన విషయాన్ని గోపిరెడ్డి గుర్తుచేశారు, బీసీలు, మహిళల ఆదరణ సీఎం జగన్ మోహన్ రెడ్డికి మెండుగా ఉందని ఆ సర్వే ద్వారా స్పష్టం చేశారన్నారు. ముచ్చటగా మూడో సారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.అవాస్తవాలతో రాజకీయాల్లో దిట్ట అయిన అరవింద్‌బాబు మీ ముందుకు వస్తున్నారని, కూటమి పేరుతో కుళ్ళు రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే వైఎస్సార్ సీపీ బలమన్నారు. ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉంటానని, రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకి విజయం అందించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నగరాభివృద్ధి అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేశ్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మాజేటి సాంబశివ రావు, నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దన్న, ప్రవల్లికా సత్యం, మద్ది రామబ్రహ్మానందరావు, చిన్ని శ్రీనివాసరావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

నరసరావుపేట రూరల్: మండలంలోని గోనెపూడిలో గురువారం రాత్రి 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. నాయకులు యంపరాల అప్పయ్య, ఆదినారాయ యాదవ్ ఆధ్వర్యంలో చేరిన వీరికి పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు అనిల్‌కుమార్‌యాదవ్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా బీసీ అభ్యర్థి అయిన తనకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని తెలిపారు. తమపై నమ్మకంతో అప్పయ్య, ఆదినారాయణ కుటుంబాలు పార్టీలో చేరాయని చెప్పారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌పై అభిమానంతో వీరందరూ పార్టీలో చేరారని, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసయాదవ్, సర్పంచ్ రామయ్య, చెంచయ్య పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి కండువాలను కప్పుతున్న పార్లమెంటు అభ్యర్థి అనిల్

ఎన్నికల శిక్షణకు అధికారులంతా హాజరుకావాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్



నరసరావుపేట: ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అంతా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్–12ని పూర్తిచేసి శిక్షణకు వచ్చేలా రిటర్నింగ్ అధికారులు(ఆర్వో)లు స్పష్టంగా తెలపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బంది గురువారం మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో 2,370 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీవో)లుగా, 2,375 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో)లుగా వ్యవహరించనున్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎన్నికల సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి పోలింగ్ పర్సనల్స్ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ విషయాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారులు వారికి తెలియజేయాలని చెప్పారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన ఉత్తర్వులు పోలింగ్ పర్సనల్స్ అందరికీ వస్తాయని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీకు పుణ్యం...మాకు సేవా ఫలం

- మిగిలిన ఆహారాన్ని అందిస్తూ.. కాలే కడుపులకు పట్టెడన్నం
- నాలుగేళ్ల సేవా ప్రస్థానంలో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్
- ఆహారాన్ని పారేయొద్దు..మాకందించండి.. మీ పేరుతోనే పంచిపెడతామంటున్న ట్రస్ట్ సభ్యులు

గుంటూరు మెడికల్ : అన్నం పర బ్రహ్మ స్వరూపం. అలాంటి ఆహారాన్ని శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల వేళల్లో వృథాగా పడేస్తుంటారు. అలా కాకుండా మానవతా దృక్పథంతో ఆలోచిస్తే కాలే కడుపుల క్షుద్బాధను తీర్చగలమంటున్నారు వాళ్లు. ఆకలితో అలమటించేవారికి పట్టెడన్నం పెట్టే మార్గం కోసం అన్వేషించారు. ఆ ఆలోచనలోంచి పుట్టుకొచ్చిందే మిగిలిపోయిన ఆహార సేకరణ. 'పదార్థాలను వృథాగా పార బోయకుండా మాకు అందిస్తే మీ పేరుతో మేమే పేదలకు భోజనం పెడతాం. వారి ఆకలి తీరుస్తాం.మీకు పుణ్యం ..మాకు సేవా ఫలం' అంటూ నాలుగేళ్లుగా తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. వారే గుంటూరు నగరానికి చెందిన 'గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులు. అన్నార్తుల సేవలో తరిస్తోన్న ట్రస్ట్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

మహమ్మారి వేళ మొగ్గతొడిగి..

గుంటూరు జీజీహెచ్ డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ ఎదురుగా ప్రధాన గేటు వద్ద వైఎస్సార్ ఫుడ్ కోర్టును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉచితంగా అన్నదానం చేస్తూ ఉండటంతో కార్పొరేషన్ అధికారులు ఫుడ్ కోర్టును కూడా వారికి అప్పగించారు. ఇక్కడ ప్రతిరోజూ మధ్యాహ్నం 300 మందికి పైగా ఉచితంగా భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్నారు. మహమ్మారి సమయంలోనూ కోవిడ్ పాజిటివ్ బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి ఉచితంగా భోజనం అందించి ఈ ట్రస్ట్ సభ్యులు పలువురి మన్ననలు పొందారు.

సేవా నిరతి..ప్రశంసల హారతి

మహమ్మారి విజృంభించే తొలి రోజుల్లో కోవిడ్ సోకి మరణిస్తే వారి భౌతిక కాయాల్ని పట్టుకునేందుకు కుటుంబ సభ్యులు సైతం భయపడిపోయేవారు. మరణించిన వారిని ఆస్పత్రుల్లోనే వదిలేసేవారు. అందరూ ఉండి అనాథలుగా శవాగారాల్లో ఉన్న భౌతికకాయాల్ని చూసి చలించిన నగరానికి చెందిన కొందరు యువకులు 2020లో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యికి పైగా భౌతిక కాయాలకు వారి సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వ హించారు. సొంతంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి రోగుల్ని వారికి నచ్చిన ఆస్పత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించేవారు. ఇప్పుడు కూడా ఈ సేవలను కొనసాగిస్తున్నారు.



గుంటూరు జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు ఉచిత భోజనం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్

ఆకలి తీరుస్తూ..ఆదర్శంగా నిలుస్తూ..

మహమ్మారి విజృంభించిన రోజుల్లో లాక్‌డౌన్ కారణంగా పనుల్లేక పస్తులతో అలమటించిన వారి దైన్యాన్ని చూసిన ట్రస్టు సభ్యులు వారి కోసం ఏదో చేయాలని సంకల్పించారు. పలు ప్రాంతాల నుంచి చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన రోగుల సహాయకులకు బయట ఎక్కడా భోజనం లభించని దుస్థితి చూసారు. తమ వేతనాల్లో నుంచి కొంత చందా వేసి ఉచితంగా భోజనం అందించడం ప్రారంభించారు. అయితే అన్నార్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో సేవల విస్తృతిని పెంచేందుకు ముందుకొచ్చారు. ఆహార సేకరణపై దృష్టి సారించారు.ఇందులోంచి పుట్టుకొచ్చిందే మిగులు పదార్థాల సేకరణ.

ట్రస్ట్ సేవలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లివే..

8143222456, 9397602553, 7396722171

ముందస్తు ప్రణాళికతో ..

రోజూ జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో శుభ కార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటి డేటాను ముందురోజు సేకరిస్తారు. ఆయా నిర్వాహకులను సంప్రదిస్తారు. మిగులు పదార్థాలను పార బోయకుండా సమాచారమిస్తే వచ్చి సేకరిస్తామని చెబుతారు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదించి శుచి, శుభ్రతగా ఉండే ఆహార పదార్థాలను సేకరిస్తారు. వాటిని ఫుడ్ కోర్టుకు తరలించి మరోసారి తనిఖీ చేసి అన్నార్తుల కడుపు నింపే కార్యక్రమంలో తలమునకలవుతారు. ఇలా నాలుగేళ్లుగా సేవలను సాగిస్తూ, ప్రతిరోజూ 300 మంది ఆకలిని తీరుస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లాలో రూ.1.34 కోట్ల విలువైన నగదు, మద్యం సీజ్

నరసరావుపేట: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలైన దగ్గర నుంచి రూ.39.02 లక్షల నగదు, రూ.39.81 లక్షల విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులు వెరసి మొత్తం రూ.1.34 కోట్ల విలువైన సొత్తును సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పక్కా అకౌంటింగ్ ఉన్న వాటికి 24 గంటల్లో రిలీజ్ చేశామన్నారు. సీవిజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారుల ద్వారా పరిష్కరించామన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో కలిపి 730 అనుమతులు ఇవ్వటం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. ఎవరూ ఆ నిబంధనలు అతిక్రమించవద్దని పేర్కొన్నారు. బాబూ జగ్జీవనరామ్ జయంతిని శుక్రవారం పార్టీలకు అతీతంగా నిర్వహించుకోవచ్చన్నారు. ఓటరు జాబితా కూర్పులో తొలగింపులు, మార్పులు ఆపివేయటం జరిగిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 14 లోపు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

రేపు సత్తెనపల్లిలో వైకల్య నిర్ధారణ వైద్య శిబిరం

నరసరావుపేట ఈస్ట్: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఈనెల 6వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సత్తెనపల్లిలోని భవిత పాఠశాలలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, సత్తెనపల్లి, రాజుపాలెం, బెల్లంకొండ, ముప్పాళ్ల మండలాల్లోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు వైద్య శిబిరానికి హాజరై వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆయా మండలల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు, భవిత పాఠశాలల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వైద్య శిబిరానికి తీసుకురావాలని సూచించారు.

ఊయల.. ఉరితాడైంది !

ప్రమాదవశాత్తు విద్యార్థి మృతి

గురజాల : ఊయల ఉరితాడై విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని దైదలో నివసిస్తున్న కొల్లిపాక శ్రీను, శివలక్ష్మిల కుమారుడైన నారాయణ (13) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో ఉదయం పాఠశాలకు వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి సమీపంలో ఉన్న రావి చెట్టుకు స్నేహితులతో కలసి చీరలు తీసుకుని వెళ్లి ఉయ్యాల ఏర్పాటు చేసుకున్నారు. నారాయణ అందులో కూర్చుని తిరుగుతుండగా మెడకు ప్రమాదవశాత్తు చీరలు చుట్టుకున్నాయి. ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో గిరిజనులకు మేలు

- అటవీహక్కు చట్టంతో భూములపై శాశ్వత హక్కు
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- చింతలతండా గ్రామంలో ఎన్నికల ప్రచారం


చింతల తండా గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


పిన్నెల్లికి హారతి పడుతున్న గిరిజన మహిళలు

విజయపురిసౌత్: గిరిజనుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెలుగు నింపారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటు పడుతోందన్నారు. గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. 2008వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అటవీ హక్కులచట్టం ఏర్పాటు చేసి గిరిజనులు సాగు చేసుకునే భూములపై వారికే హక్కు కల్పించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటి ముంగిటకే ప్రభుత్వం సంక్షేమ పథకాలను చేరవేస్తుందన్నారు. గత ఐదేళ్లలో గడపగడపకూ అభివృద్ధి ఫలాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ముందుగా చింతలతండా గ్రామానికి చేరుకున్న పీఆర్కేకు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. తండాలో అడుగడుగునా ప్రజలు నిరాజనాలు పలికారు. అనంతరం గురునానక్ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, మండల నాయకుడు బూడిద శ్రీను, మాచర్ల మండల వైస్ ఎంపీపీ సుజాత కోటిరెడ్డి, చింతలతండా సర్పంచ్ కేతావత్ శ్రీను నాయక్, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జి సీతానాయక్, వైస్ సర్పంచ్ లచ్చు, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నోముల కృష్ణ, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బద్దెల శ్రీను, నాయకులు మద్దిగవు పాపిరెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, బూడిద సైదలు, రంగానాయక్, జఠావత్ గాసీరామ్, రమావత్ సక్రూనాయక్, కేతావత్ జారు, ఆర్ హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయ పలకరింపులు..జనం నీరాజనాలు

- అభిమానుల కోలాహలం మధ్య పెదకూరపాడు వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంతకుమారి ఇంటింటి ప్రచారం
- ధరణికోటలో రెండో రోజు కొనసాగిన ప్రచారం


అవ్వా తాతల యోగక్షేమాలు తెలుసుకుంటూ..


స్థానిక మహిళలతో మమేకమైన వసంతకుమారి

అమరావతి: అమ్మా నీకు ఇంటి స్థలం వచ్చిందిగా ఇల్లు కట్టుకున్నావా..అవ్వా నీకు పింఛన్ అందుతుందా.. మీ పిల్లలకు అమ్మఒడి సొమ్ము ఖాతాలో పడుతుందిగా..పిల్లలు బాగా చదువుకుంటున్నారా..అంటూ ఆప్యాయ పలకరింపుల మధ్య నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంతకుమారి ఇంటింటి ప్రచారం కొనసాగింది. బుధవారం రాత్రి మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టిన ఆమె గడప గడపకూ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు మీరు అండగా నిలవాలంటూ ధరణికోటలో రెండో రోజు ప్రచారంలో ఓటర్లను అభ్యర్థించారు. తొలిరోజు మంగళవారం జైల్‌సింగ్ కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. రెండోరోజు అల్లుళ్లపేట, ముస్లిం కాలనీ, పల్లెకారుల బజార్, శాలివాహన కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ధరణికోటలో గడప గడపకు తిరుగుతూ కాలనీ వాసులకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రచారం సాగింది. సీఎం జగన్‌మోహరెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టి వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు అలపాటి వీరయ్య, కొండవీటి కోటేశ్వరరావు, మాదాసు రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కంభంపాటి శాంతమ్మ, నడకుదురు నాగరాజు, సరిపూడి శివయ్య, దాసు, భిక్షమయ్య, సూరిబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల బాహాబాహీ

జనసేన మండల పార్టీ కన్వీనర్‌కు గాయాలు

మాచర్లరూరల్ : ఎన్నికల ప్రచార వాహనంపై తమకు ప్రాధాన్యమివ్వకుండా జనసేన నాయకుల పెత్తనం ఏమిటంటూ టీడీపీ శ్రేణులు ప్రశ్నించడంతో ఇరుపార్టీల నాయకులు నడివీధిలో పరస్పర దాడులకు దిగారు. ఇరుపార్టీల నాయకుల మధ్య తలెత్తిన ఘర్షణలో జనసేన మండల పార్టీ కన్వీనర్ సాంబశివరావుకు గాయాలయ్యాయి. ఈనెల 3న రాత్రి సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని తాళ్లపల్లిలో టీడీపీ నియోజక వర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే సమయంలో జనసేన వీర మహిళ అధ్యక్షురాలు, మండల పార్టీ కన్వీనర్ ప్రచారం చేస్తుండగా బ్రహ్మనందరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఒక్క ఓటు కూడా వేయించలేని జనసేన పార్టీ వారు మా మీద పెత్తనం చేయడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రచార రథాన్ని ఆపాలంటూ గొడవకు దిగారు. దీనిపై జనసేన మండల పార్టీ కన్వీనర్ వర్గీయులు టీడీపీ వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొన్నటి వరకు వైఎస్సార్‌సీపీలో ఉంటూ ఈ రోజు స్వప్రయోజనాలకు టీడీపీలోకి వచ్చి మాపై విమర్శలు చేస్తే బాగుండదంటూ ఘర్షణకు దిగారు. ఈ పరిణామంతో ఇరుపార్టీలవారు రెండు వర్గాలుగా విడిపోయారు. పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ ఘర్షణలో జనసేన మండల పార్టీ కన్వీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ పరిణామంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నాయకులే నడివీధుల్లో కొట్టుకోవడాన్ని స్థానికులు అసహ్యించుకుంటున్నారు.కాగా ఘటనపై పోలీసు కేసు నమోదుకాకపోవడం గమనార్హం.

వైఎస్సార్ సీపీలో చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని 20వ వార్డులో కూరగాయల మార్కెట్‌కు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి కారణంగా పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింత సంక్షేమం అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఆయుధం

సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ


ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ మురళీకృష్ణ, అధికారులు

సత్తెనపల్లి: ఓటు ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం లాంటిదని దీనిని ప్రతి ఓటరు వినియోగించుకొని నవసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద నుంచి పట్టణంలో గురువారం నిర్వహించిన స్వీప్ ఓటర్ల అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు వేయడం ప్రజలందరి బాధ్యత అని, ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం నిర్వహణ అధికారులుగా తమ బాధ్యత అన్నారు. తహసీల్దార్ సీహెచ్ ఉష మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా తప్పక నమోదు చేసుకోవాలని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాక పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఓటు ఆవశ్యకతపై నిర్వహించిన ర్యాలీలో విద్యార్థినిలు ప్లకార్డులు చేతబట్టి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోసుబాబు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

7 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

- కొండవీటి, పుచ్చలపల్లి సుందరయ్య కళా పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ
- 7, 8 తేదీల్లో లింగారావుపాలెంలో..
- 9,10 తేదీల్లో యడ్లపాడులో నిర్వహణ

యడ్లపాడు: కొండవీటి కళా పరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా రెండు కళాపరిషత్‌లు కలిసి నాటికల పోటీలు నిర్వహించడం విశేషం. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఆయా పరిషత్‌లు నాటికల ప్రదర్శనలకు పోలీసుల నుంచి అనుమతిని సైతం పొందాయి. ఏప్రిల్ 7, 8, 9, 10 తేదీల్లో వరుసగా నాలుగు రోజుల పాటు 12 నాటిక ప్రదర్శనలు జరగనున్నాయి. ప్రతిరోజు నాటిక ప్రారంభ పూజా కార్యక్రమం మినహా గతంలో మాదిరిగా ప్రదర్శన మధ్యలో దాతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నిర్వహించే సభా కార్యక్రమం ఉండదని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8 నుంచి 11 గంటలకు ప్రతిరోజు మూడు నాటిక ప్రదర్శలు ఉంటాయన్నారు. ఇలా రెండు పరిషత్‌లు కలిసి రెండు గ్రామాల్లో రెండేసి రోజులు చొప్పున నాలుగు రోజుల పాటు కళావిందు చేయనున్నాయి. మొదటి రెండు రోజులు లింగారావుపాలెం గ్రామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలోనూ, తదుపరి రెండు రోజులు యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళావేదిక ప్రాంగణంలోనూ నాటిక ప్రదర్శనలు కొనసాగనున్నాయని ఆయా పరిషత్‌ల నిర్వాహణ విభాగం అధ్యక్ష కార్యదర్శులు కట్టా శ్రీహరి, ముత్తవరపు సురేష్‌బాబు, మండెపూడి శ్రీనివాసరావు, నూతలపాటి కాళిదాసు తెలిపారు. కార్యక్రమంలో తోకల సాంబశివరావు, ముత్తవరపు పద్మారావు, కట్టా వీరాంజనేయులు, జరుగుల శంకరరావు, మల్నేని సీతారామాంజనేయులు, నంబూరి వీరాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు ఉన్నారు.

చంద్రబాబు దుర్బుద్ధితో అవ్వాతాతలకు అవస్థలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 10, 11 వార్డులలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): పింఛను కోసం పడిగాపులు పడి మృతి చెందిన అవ్వా తాతల ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 10, 11వ వార్డులలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. చంద్రబాబు ఒంటరిగా పోటీకి దిగలేక బీజేపీ, జనసేనలతో పొత్తు పెట్టుకొని మరలా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. మణిపూర్, త్రిపుర వంటి రాష్ట్రాలలో దళితులపై దాడులు జరుగుతున్నాయని దీనికి కారణం బీజేపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాత్రం అటువంటి వారి పాలనను సమర్థిస్తూ, సీఏఏ చట్టం చాలా బాగుందని ప్రకటించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే రానున్న రోజులలో వినుకొండను రాష్ట్రంలోనే పేరున్న నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ తనకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు కంటి పరీక్షలతో అంధత్వ నివారణ

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్సలు
- జాతీయ అంధత్వ దినోత్సవం పురస్కరించుకొని సూచనలు చేసిన ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామలింగారెడ్డి


సమావేశంలో డాక్టర్ రామలింగారెడ్డి

నరసరావుపేట: అంధత్వ నివారణకు కంటి శుక్లాల ఉచిత శస్త్ర చికిత్సలను కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోవచ్చని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏఏవీ.రామలింగారెడ్డి పేర్కొన్నారు. పేదవారికి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేసి మందులు ఇచ్చి ఇళ్లకు వెళ్లేందుకు చార్జీలు సైతం ఇవ్వటం జరుగుతుందన్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానమనే నినాదంతో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న అంధత్వ నివారణ దినోత్సవాలు సందర్భంగా గురువారం తన వైద్యశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంధత్వానికి గురి కాకుండా ముందుగానే నివారించ కల్గిన ఐదు రకాల కళ్ల జబ్బులపై ప్రజలకు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న పిల్లలకు వచ్చే కళ్ల జబ్బుకు కళ్లజోళ్లు వాడకుండా ముందుగానే జబ్బును కనుగొని అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. తీసుకునే ఆహారంలో ఏ విటమిన్ లోపం వలన వచ్చే రేచీకటిని నివారించవచ్చునని అన్నారు. ఆకుకూరలు, గ్రుడ్లు, పండ్లు తినటం వలన విటమిన్ లోపం అధిగమించవచ్చన్నారు. 40 ఏళ్లు దాటిన వారికి కళ్లజోళ్లు ఇస్తే అంధత్వం నివారించవచ్చన్నారు. శుక్లాలు వచ్చిన వారు దూరపు చూపు కోల్పోవటం, డ్రైవింగ్ చేయలేక పోవటం, ఇంట్లో తిరిగేందుకు కూడా ఇబ్బంది పడుతుంటారన్నారు. అంధత్వ నివారణ కోసం తమ వైద్యశాల ద్వారా శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేసి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. శుక్లాల తర్వాత ఎక్కువగా నీరుకాసుల జబ్బు వస్తుందన్నారు. దీనిని త్వరగా కనుగొనటం చాలా కష్టమన్నారు. ముందుగానే పరీక్షలు చేయించుకోవడం తప్పితే బయటపడవన్నారు. గుండె జబ్బులు, స్టంటులు వేయించుకున్న వారు కూడా నీరుకాసులు ఉన్నాయో లేదో చూపించుకోవాలన్నారు. మధుమేహం వలన వచ్చే కళ్ల జబ్బులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. మధుమేహం నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు పవనీశ్వరరెడ్డి, శాంతిశ్రీ, ప్రకృతి పాల్గొన్నారు.

జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో చదువుకు దూరమైన, బడిఈడు పిల్లలను గుర్తించాలని సమగ్రశిక్ష గుంటూరు జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు కలిగి, బడి మధ్యలో మానేసిన విద్యార్థులతో పాటు ఐదేళ్లకు పైబడి బడిఈడు కలిగిన బాలల వివరాలపై ఈ నెల 10వ తేదీ లోపు క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేయాలని సీఆర్పీలకు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక రోగి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకమ్మరావునగర్‌కు చెందిన ఎ.రాజు (32) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న సిగరెట్ కాల్చేక్రమంలో అగ్గిపుల్ల జేబులో వేసుకున్నాడు. మంటలు వ్యాపించి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.